మంట పెడితే ముప్పే

- పంట అవశేషాలను పొలంలోనే కాల్చడం వల్ల మిత్ర పురుగులు, సూక్ష్మజీవుల నాశనం
- రొటావేటర్‌తో కలియదున్నడం వల్ల భూసారం పెంపు
- సూపర్‌పాస్ఫేట్ చల్లితే భూ పోషకాలు పెరిగి అధిక దిగుబడికి దోహదం


జూపాడుబంగ్లా వద్ద వరి పంట నూర్పిడి అనంతరం పొలంలోని అవశేషాలను కాల్చివేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: నైరుతి రుతుపవనాలు ముంచుకొస్తుండటంతో రైతులు పొలాల్లో వేసవి దుక్కులను దున్నుకోవడంతో పాటు పంటల అవశేషాలను, పొలం గెట్ల వెంట ఉన్న చెత్తా, చెదారాన్ని కాల్చి ఖరీఫ్ పంటల సాగుకు సన్నద్ధం చేసుకుంటున్నారు. అయితే పంటల అవశేషాలను పొలంలో కాల్చడం వల్ల భూమిలోని మిత్రపురుగులు, సూక్ష్మజీవులు చనిపోయి పంటల దిగుబడి 20ఏళ్లకు తగ్గిపోతుందని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి చెబుతున్నారు. రబీ పంటల అనంతరం పొలంలో మిగిలిన అవశేషాలను అక్కడే రొటావేటర్ సహాయంతో దున్నేసి సూపర్‌పాస్ఫేట్ చల్లడం వల్ల రెండువారాల్లోగా చెత్తాచెదారం కుళ్లిపోయి పోషకాల శాతం పెరుగుతుందని తెలిపారు. ఆయన వెల్లడించిన సమగ్ర వివరాలు రైతుల కోసం..

పొలంలో పంటల అవశేషాలు కాల్చడం వల్ల కలిగే నష్టాలు

- పంటల నూర్పిడి అనంతరం పొలంలో మిగిలిన పంటల అవశేషాలు, చెత్తాచెదారాన్ని కాల్చడం వల్ల భూమిలోని నత్రజని, పాస్ఫరస్ వంటి పోషకాల శాతం తగ్గి పంటల దిగుబడి 20ఏళ్లు వెనక్కి వెళ్తుంది.
- పొలంలో దున్నేయడానికి వీలుకాని పత్తి, కంది, మొక్కజొన్న, జొన్న, కొయ్యలను పొలంలోంచి ఏరి పొలానికి దూరంగా వేసుకోవాలి.
- అలాకాకుండా పొలంలోంచి ఏరిన పత్తి, కంది, మొక్కజొన్న, జొన్న కొయ్యలతో పాటు నూర్పిడి చేసిన ధాన్యం పొట్టును పొలంలోనే కాల్చడం వల్ల భూమి వేడెక్కి పంటలకు మేలుచేసే మిత్ర పురుగులు, సూక్ష్మజీవులు చనిపోయి భూసారం, సాంద్రత తగ్గుతుంది.

పొలంలో కలియదున్నడం వల్ల ప్రయోజనాలు

- వరి, మొక్కజొన్న, జొన్న కొయ్యలను ఏరివేయకుండా రొటావేటర్ సహాయంతో పొలంలో కలియదున్నటం వల్ల భూమిలో సేంద్రియ కర్బన శాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10శాతం పెరుగుతాయి.
- పంటల అవశేషాలను రొటావేటర్ సహాయంతో దున్నేసమయంలో దుక్కిలో సూపర్‌పాస్ఫేట్‌ను చల్లడం వల్ల పంటల అవశేషాలు త్వరగా కుళ్లి భూమిలో పోషకాలశాతం పెరుగుతుంది. తద్వారా సాగుచేసిన పంటలకు డీఏపీ వాడకం సగం వరకు తగ్గించుకోవచ్చు.
- పంటల అవశేషాలను పొలంలో కలియదున్నటం వల్ల ఎకరాకు కనీసం టన్ను వరకు సేంద్రియ ఎరువు ఉత్పత్తి కావడంతో పాటు సాగుచేసిన పంటలకు రెండుశాతం నత్రజని (యూరియా), 4 శాతం పాస్ఫరస్ అదనంగా లభిస్తాయి.
- పొలంలో జింక్, మాంగనీసు, ఇనుము, కాల్షియం, సూక్ష్మధాతువుల శాతం పెరిగి సాగుచేసిన పంటల మొక్కలకు ఎంతగానో దోహదపడటం వల్ల పంటల దిగుబడి గణనీయంగా పెరుగుతుంది.

రసాయన ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చు



పంటల నూర్పిడి ముగిసిన తర్వాత పంటల అవశేషాలను రొటావేటర్ సహాయంతో పొలంలోనే దున్నుకోవటం చాలా మంచిది. మొక్కజొన్న, జొన్న, వరి కొయ్యలకు పొలంలో నిప్పుపెట్టడం వల్ల భూమిలో పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు చనిపోవటం వల్ల భూసాంద్రత తగ్గుతుంది. తద్వారా సాగుచేసిన పంటల దిగుబడి తగ్గుతుంది. అలాకాకుండా దుక్కిలో సూపర్‌పాస్ఫేట్‌ను చల్లుకొని రొటావేటర్ సహాయంతో దున్నుకోవటం వల్ల చెత్తా, చెదారం త్వరగా కుళ్లి సేంద్రియ ఎరువుగా మారడంతో పాటు సూక్ష్మధాతువుల సంఖ్యపెరిగి రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చు.

– కృష్ణారెడ్డి, మండల వ్యవసాయ అధికారి, జూపాడుబంగ్లా

ముగిసిన వలంటీర్ల ఇంటర్వ్యూలు

జూపాడుబంగ్లా: ఖాళీగా ఉన్న వలంటీరు పోస్టుల భర్తీ కోసం శనివారం తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఈఓపీఆర్డీ మణిమంజరి, సూపరింటెండెంట్ జ్యోతి ఇంటర్వ్యూలు నిర్వహించారు. తరిగోపుల, జూపాడుబంగ్లా–1 గ్రామసచివాలయాల పరిధి ఒక్కొక్కటి చొప్పున వలంటీరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటికోసం ఆయా గ్రామాల నుంచి ఒక్కొక్కరు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. రెండు పోస్టులకు కేవలం ఒక్కొక్కరుగా మాత్రమే దరఖాస్తు చేసుకున్నందున వారిని వలంటీర్లుగా నియమించనున్నట్లు ఈఓపీఆర్డీ మణిమంజరి తెలిపారు. జూన్ 1 నుంచి వారిని విధుల్లోకి తీసుకోనున్నట్లు వెల్లడించారు.

సరైనపత్రాలు లేకుంటే శిక్షార్హులు

కొత్తపల్లి: వాహనదారులు వాటికి సంబంధించిన అన్ని పత్రాలు ఉన్నప్పుడు మాత్రమే వాహనాలు నడపాలని, లేకుంటే శిక్షార్హులు అవుతారని ఎస్‌ఐ హుస్సేన్‌సాహెబ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని బావాపురం గ్రామ సమీపంలోని పెట్రోల్ బంకువద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనం కలిగిన ప్రతి ఒక్కరు సరైనపత్రాలు, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ద్విచక్రవాహన దారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. సరైన పత్రాలు లేని 10 వాహనాలపై కేసులు నమోదు చే శామని, వీటికి జరిమానాగా రూ.1950 విధించామని చెప్పారు.

క్లుప్తంగా

అన్నదానం ఎంతో పుణ్యఫలం


అరటన్ను బియ్యాన్ని విరాళంగా అందజేస్తున్న దాతలతో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: ఒకరికి అన్నదానం చేస్తే ఎంతో పుణ్యఫలం దక్కుతుందని ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అబ్బీపురం మాజీ సర్పంచ్ చింతకుంట్ల నాగలక్ష్మమ్మ, బాలరెడ్డి జ్ఞాపకార్థ వారి కుమారులు చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీనాథ్‌రెడ్డి మహానందిలో అన్నదాన ప్రసాద పథకానికి శనివారం అరటన్ను బియ్యం విరాళంగా అందించారు. ఈఓ మాట్లాడుతూ ఆకలితో ఉన్న వారికి అన్నప్రసాదం అందించడం మంచి కార్యక్రమమన్నారు. అనంతరం స్థానిక కార్యాలయంలో దాతలకు స్వామి,అమ్మవార్ల ప్రసాదాలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటేశ్వరుడు , అన్నదానం పథకం ఇన్‌చార్జ్ రామశివ పాల్గొన్నారు.

31న మహానంది ధర్మకర్తల మండలి సమావేశం

మహానంది: మహానందిలో ఈ నెల 31వ తేదీన ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. దేవస్థానం కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో 14వ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఆదాయ, వ్యయ వివరాలపై చర్చించనున్నట్లు చెప్పారు. ట్రస్టుబోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి ధర్మకర్తల మండలి సభ్యులు హాజరు కావాలని కోరారు. రూ.80 లక్షలతో చేపట్టనున్నట్లు కోనేరుల ఆధునీకరణ పనులు, టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించనున్న వసతి గృహాల నిర్మాణంపై చర్చించనున్నట్లు వెల్లడించారు.

సమ్మర్ క్యాంపుతో విజ్ఞానం


సమ్మర్‌క్యాంపులో భాగంగా తాడాట ఆడుతున్న విద్యార్థులు

కొత్తపల్లి: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపుల ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని లైబ్రేరియన్ కౌసల్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో సమ్మర్‌క్యాంపులో విద్యార్థులకు ఆటపాటలతో పాటు నీతి కథలు చదవడం, సమాజంలోజరిగే విషయాలను తెలుసుకునేందుకు న్యూస్‌పేపర్ చదివించారు. అలాగే క్యారమ్ బోర్డు, చెస్, తాడాట వంటి ఆటలు ఆడించారు.

నీటి సమస్య పరిష్కారం


మోటార్‌కు మరమ్మతులు చేసిన దృశ్యం

మిడుతూరు: మండలపరిధిలోని అలగనూరు గ్రామ పంచాయతీ పరిధిలో మోటార్ మరమ్మతులకు గురై నీటి సమస్య తలెత్తింది. శనివారం ఆ మోటార్‌ను రిపేరు చేయించి నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి అనురాధ తెలిపారు.

కౌలుకార్డుకు దరఖాస్తు చేసుకోండి


రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏడీఏ విజయశేఖర్

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లోని కౌలు రైతులందరూ తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ విజయశేఖర్ సూచించారు. శనివారం మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తమ ఆధార్ కార్డు, పాసుపుస్తకం , కౌలు ఖరారు పత్రాల జిరాక్స్‌లను రైతు భరోసా కేంద్రాలలో అధికారులకు అందజేసి, కౌలు గుర్తింపు కార్డులను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రావణి, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

స్పందనకు గైర్హాజరైతే షోకాజ్ నోటీస్

పగిడ్యాల: గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు నిర్వహించే స్పందనకు ఉద్యోగులు గైర్హాజరైతే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీడీఓ వెంకటరమణ పంచాయతీ కార్యదర్శి వీరన్న యాదవ్‌కు ఆదేశించారు. శనివారం నెహ్రూనగర్ గ్రామ సచివాలయ రికార్డులను పరిశీలించారు. స్పందనకు ఉద్యోగులు హాజరు కాకుండా ఆఫీస్ డ్యూటీ(ఓడీ)పై ఎలా వెళ్తారని ప్రశ్నించారు. గ్రామాల నుంచి జిల్లా కేంద్రాలకు ప్రజా వినతులు వెళ్లకుండా గ్రామ స్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రతి రోజు సచివాలయాలలో 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందనను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నంద్యాల ఆర్డీఓకు మహానందీశ్వరుడి ప్రసాదం


మహానందీశ్వరుడి మెమెంటోతో ఆర్డీఓను సత్కరించి ఈఓ, వేదపండితులు

మహానంది: సుమారు 15 ఏళ్ల నుంచి మహానందీశ్వర దేవస్థానం అధికారులు చేస్తున్న ప్రయత్నం ఫలించి దేవస్థాన భూములకు సంబంధించి రూ.అరకోటి నష్టపరిహారం మంజూరైన విషయం తెలిసిందే. నంద్యాల పట్టణంలోని మూలసాగరం పరిధిలో సర్వే నంబర్ 487 లో 9.44 ఎకరాల భూముల్లో భాగంగా 6.97 ఎకరాలు కుందూ విస్తరణకు కేటాయించారు. అందులో భాగంగా ఇటీవల ఈ నెల 26న రూ.49 లక్షలు నష్టపరిహారం మంజూరు అయ్యింది. దీంతో శనివారం నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులును ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర్ అవధాని, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు కలిసి శ్రీకామేశ్వరీ దేవి మహానందీశ్వర స్వామివార్ల మెమెంటోతో పాటు ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

రేపు దేవాలయ భూముల వేలం

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి, శ్రీ రామేశ్వర స్వామి ఆలయాలకు సంబంధించిన భూముల వేలం పాటలు 29వ తేదిన సోమవారం ఉదయం 10 గంటలకు దేవాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ గురెడ్డి శనివారం తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు రూ. 2,000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వేలం పాటలు ఒక్క సంవత్సరానికి మాత్రమే నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మహానంది: ఈనెల 29న బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామంలో వెలసిన శ్రీ ఈశ్వర చెన్నకేశవ స్వామి ఆలయానికి చెందిన భూములకు వేలాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ నాగప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 50 ఎకరాల భూములకు వేలాలు ఉంటాయన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు బి.కోడూరులో శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానంకు చెందిన సుమారు 15 ఎకరాల భూములకు వేలాలు ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలాల్లో పాల్గొనవచ్చని చెప్పారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి


సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, పీడీ సురేష్‌బాబు, అధికారులు

ఆత్మకూరు: జగనన్న కాలనీల్లో గృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్, జిల్లా హౌసింగ్ పీడీ సురేష్‌బాబు సూచించారు. పట్టణంలోని శనివారం జగనన్న గృహ నిర్మాణ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జగనన్న గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులకు బిల్లుల్లో ఎలాంటి జాప్యం ఉందని, ఇల్లు కట్టిన వెంటనే మంజూరు చేస్తామని చెప్పారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో జగనన్న కాలనీలో లే–అవుట్లు, మైనార్టీ కాలనీ, చక్రం హోటల్, దుద్యాల రస్తాలో పనులు నత్త నడకన జరుగుతున్నాయని చెప్పారు. పట్టణంలోని 3,961 మందికి గృహాలు మంజూరు కాగా ఇప్పటికి 1,333 మంది మాత్రమే ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. అంతకు మునుపు పీడీసురేష్ బాబు జగనన్న కాలనీలోని పక్కా గృహాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ దాస్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి పరమేశ్వరి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, డీఓ కోటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు


బదిలీపై వెళ్తున్న సిబ్బందిని సన్మానిస్తున్న ఎంపీడీఓ, ఈఓఆర్డీ

కొత్తపల్లి: ఉద్యోగి నిబద్ధతతో పనిచేసినప్పుడు ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీడీఓ మేరి అన్నారు. శనివారం స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో బదిలీలపై వెళ్తున్న టెక్నికల్ అసిస్టెంట్లను సన్మానించారు. ఆమె మాట్లాడుతూ బదిలీలపై వెళ్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు జాకీర్, ఫయాజ్, శ్రీరాములు, కంప్యూటర్ ఆపరేటర్ అనిల్‌లు ఎన్‌ఆర్ ఈజీఎస్‌లో ఎన్నో సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయుడు, ఏపీఓ షేక్.రేష్మా, ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్, ఈసీ శ్రీనివాసులు ఉన్నారు.

జగనన్న కాలనీ పరిశీలన


దుద్యాల రహదారిలోని జగనన్న కాలనీలో గృహాల నిర్మాణాలు పరిశీలిస్తున్న పీడీ, ఆర్డీఓ

ఆత్మకూరు: పట్టణంలోని జగనన్న పక్కాగృహాల నిర్మాణాలను జిల్లా హౌసింగ్ పీడీ సురేష్‌బాబు, ఆర్డీఓ దాస్ శనివారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని దుద్యాల రస్తా, చక్రంహోటల్, మైనార్టీ కాలనీలోని పక్కాగృహాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులుకు బిల్లుల సమస్య ఉండే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ఉమామహేశ్వరరావు, ఏఈ ఉమామహేశ్వరరెడ్డి, కమిషనర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి


బ్రాహ్మణకొట్కూరులో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని గ్రామాలలో జగనన్న లేఅవుట్‌లలో లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, జాయింట్ డైరెక్టర్ రఘురాం అధికారులను ఆదేశించారు. శనివారం బ్రాహ్మణకొట్కూరులోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలను గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, హౌసింగ్ డీఈ ప్రభాకర్, ఈవోఆర్డీ సుబ్రమణ్యంశర్మ పాల్గొన్నారు.

నిర్మాణాల్లో జాప్యం తగదు

మిడుతూరు: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలల్లో జాప్యం తగదని, త్వరితగతిన నిర్మించుకోవాలని ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి అన్నారు. శనివారం హౌసింగ్ డే పురస్కరించుకొని నాగలూటి, పైపాలెం జగనన్న లే అవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలను పూర్తిచేసుకున్న లబ్ధిదారులకు విద్యుత్ మీటర్ కనెక్షన్ ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ చైర్మన్ నాగతులసిరెడ్డి, ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ రమేష్ పాల్గొన్నారు.

నిర్మాణాలు చేపట్టకపోతే పట్టా రద్దు

నందికొట్కూరు: జగనన్న కాలనీలో నిర్మాణాలు చేపట్టకుండా వదలేసిన స్థలాల పట్టాలను రద్దు చేస్తామని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు హెచ్చరించారు. శనివారం పట్టణ సమీపంలోని జగనన్న కాలనీలో జరుగుతున్న నిర్మాణాలను తహసీల్దార్, హౌసింగ్ డీఈ ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అర్హులైన పేదలను గుర్తించి ఇళ్ల స్థలాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇళ్ల నిర్మాణాలను చేపట్టకుండా అలాగే వదిలేస్తే పట్టా రద్దు చేసి కొత్తగా దరఖాస్తులు చేసుకున్న అర్హులైన పేదలకు మంజూరు చేయడం ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ భానుప్రతాప్, హౌసింగ్ ఏఈ కలాంబాషా తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కలను సాకారం చేసుకోవాలి

పగిడ్యాల: నవరత్నాలు పేదలందరికి ఇళ్లు పథకం ద్వారా సొంతింటి కలను సాకారం చేసుకోవాలని హౌసింగ్ లబ్ధిదారులకు ఎంపీడీఓ వెంకటరమణ సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని నెహ్రూనగర్ జగనన్న లే అవుట్ కాలనీని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ అనుమతి లేనిదే ఏ పనీ చేపట్టరాదు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండల కేంద్రమైన సున్నిపెంట గ్రామంలో ఏ అభివృద్ధి పని చేపట్టాలన్నా గ్రామపంచాయతీ అనుమతి తప్పనిసరి అని పంచాయతీ కార్యదర్శి బాలునాయక్ శనివారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల11న జీఓ నెంబర్ 40ను జారీ చేస్తూ 208.74 ఎకరాల్లో నిర్మితమై ఉన్న సున్నిపెంట గ్రామాన్ని పంచాయతీ రాజ్ శాఖకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఇందుకు సంబంధించి గ్రామపంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారులకు అధికారాలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గ్రామంలో అక్కడక్కడ గ్రామపంచాయతీ వారి హెచ్చరిక పేరుతో బ్యానర్లను ఏర్పాటు చేశారు.

వలంటీర్లు నిస్వార్థ సేవకులు


నందికొట్కూరులో వలంటీర్లను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి


నెహ్రూనగర్‌లో వలంటీర్ శ్రీలక్ష్మిని సన్మానిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ, సర్పంచ్ రాజేశ్వరి

- మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి
- ముగిసిన వలంటీర్లకు వందనం కార్యక్రమం

నందికొట్కూరు: వలంటీర్లు నిస్వార్థ సేవకులని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారంతో వలంటీర్లకు వందనం కార్యక్రమం ముగిసింది. ఇందులో భాగంగా పట్టణంలోని జైకిసాన్ పార్కులో 10 సచివాలయాల ఆధ్వర్యంలో వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర ఉత్తమ సేవ అవార్డులను కమిషనర్ కిషోర్, వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు చింత లక్ష్మిదేవి, రూపాదేవి, అబ్దుల్ రవూఫ్, నాయబ్, సురేష్‌లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వలంటీర్లు నిస్వార్థ సేవకులని ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి సరికొత్త విప్లవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ నబి రసూల్, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, శాలిబాషా, కుర్వ శ్రీను, ఆర్ట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వలంటీర్లకు వందనం కార్యక్రమం

పగిడ్యాల: ఈనెల 22వ తేది నుంచి మండలంలోని పది గ్రామ సచివాలయాలలో నిర్వహించిన వలంటీర్ల వందన కార్యక్రమం ముగిసింది. చివరి రోజైన శనివారం మండలంలోని నెహ్రూనగర్–1, 2 సచివాలయాల్లో గ్రామ సర్పంచ్ రాజేశ్వరి అధ్యక్షతన వలంటీర్లకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్, మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు పులేంద్రనాయుడు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు మరింత మెరుగ్గా సేవలు అందించాలి

పాములపాడు: గ్రామ వలంటీర్లు మరింత మెరుగ్గా ప్రజలకు సేవలు అందించి ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నెరవేర్చాలని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కరుణాసాగర్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పాములపాడు, రుద్రవరం గ్రామాల వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పోలీసు యాక్ట్ అమలు

వెలుగోడు: శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని ఆత్మకూరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీసు యాక్ట్ అమలులోకి తీసుకొచ్చినట్లు ఎస్‌ఐ జగన్ మోహన్ తెలిపారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

డయేరియా బాధితులు 18 మంది డిశ్చార్జ్

వెలుగోడు: గుంతకందాల గ్రామంలో డయేరియా బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 18 మంది శనివారం డిశ్చార్జ్ అయ్యారు. కాగా, గ్రామంలో కొత్తగా మరో ఆరు కేసులు నమోదు అయ్యాయి. మొత్తం 28 మంది అస్వస్థతకు గురి కాగా, 18 మంది డిచార్జ్ అయ్యారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఐదుగురు, వెలుగోడు పీహెచ్‌సీలో నలుగురు, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకరు చికిత్స పొందుతున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారు. డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం కొనసాగిస్తున్నారు.

వెదుర్ల రవాణా నిలిపివేత

మహానంది: గాజులపల్లె రైల్వే స్టేషన్‌లో ఉన్న అటవీ శాఖ డిపో నుంచి వెదుర్ల రవాణాలో శనివారం వివాదం చోటు చేసుకుంది. ఈనెల 17న వెదర్లకు వేలాలను నిర్వహించారు. అయితే వేలం పాడుకున్న వెదుర్లతోపాటు అదనంగా 2, 3 తరగతుల వెదుర్లను తరలిస్తున్నట్లు అటవీ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యా దులు వెళ్లాయి. దీంతో వెదుర్ల రవాణాను తాత్కాలికంగా నిలిపి వేస్తూ, విచారణ చేయాల్సిందిగా వారు ఆదేశాలు జారీ చేశారు.

దాతలకు సన్మానం

వెలుగోడు: పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సహకరించిన వేల్పనూరు, రేగడగూడురు గ్రామాలకు చెందిన పలువురు దాతలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. శనివారం ఆలయ కమిటీ చైర్మన్ బల్లాని వెంకటసత్యనారాయణ ఆలయ దాతలు శేఖర్, శ్రీనివాసులు, జయన్న, నాగరాజులను సన్మానించారు.

తప్పుడు సంతకాలతో తీర్మానం చేశారని ఫిర్యాదు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని విశ్వబ్రాహ్మణ సత్రం పాలక వర్గ కమిటీ ఎన్నికలు నిర్వహించకుండానే జరిగినట్లుగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలను, ఫోర్జరీ సంతకాలతో తీర్మానం చేశారని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కోటేశ్వరరావుకు విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. అలాగే కర్నూలు రిజిస్టార్ నాగమల్లేశ్వరరావుకు కూడా అందజేశారు. బాలయ్య, నాగభూషణంలతో పాటు సత్రం అధ్యక్షుడు, కోశాధికారి దొంగ సొసైటీ రిజిస్ట్రేషన్ చేసి, రెన్యువల్‌కు ప్రయత్నిస్తున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పలు దఫాలుగా టెక్‌పవర్ ద్వారా సత్రం నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు.

వృద్ధురాలికి 'రెడ్‌క్రాస్' చేయూత

వెలుగోడు: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన వృద్ధురాలికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) చేయూతనందించింది. పట్టణంలోని దాసరిపేటకు చెందిన జైనాబీ అనే వృద్ధురాలి గుడిసె ఇటీవల కాలిపోయింది. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు చేతుల మీదుగా వృద్ధురాలికి వంట పాత్రలు, బియ్యం, కందిపప్పు, నూనె, చింతపండు, గోదుమ పిండి అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, మండల అధ్యక్షుడు మునురుద్దీన్, రాజు నాయక్, అమీర్, నాగశేషులు, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

పాములపాడు: మండలంలోని జూటూరు, కోల్స్ ఆనందాపురం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు చరణ్ క్రీడాకారులకు క్రీడా సామగ్రిని శనివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో క్రీడాకారులకు క్రీడా వస్తువులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ

మహానంది: మండలంలోని అబ్బీపురం గ్రామంలో శనివారం ఏఓ నాగేశ్వరరెడ్డి రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శరభారెడ్డి, సర్పంచ్ శ్రీలక్ష్మి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆ జీపు ఎవరిదో?



గుడి సమీపంలో పార్క్ చేసిన జీపు

వెలుగోడు: మండల పరిధిలోని వేల్పనూరు గ్రామ సమీపంలో పార్క్ చేసిన కమాండర్ జీపు కలకలం రేపుతోంది. గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో 20 రోజులుగా కమాండర్ జీపును ఎవరో పార్క్ చేశారు. ఇన్ని రోజులైనా ఆ జీపును అక్కడి నుంచి తొలగించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. శనివారం ఎస్‌ఐ జగన్ మోహన్ జీపును పరిశీలించారు. దాని గురించి ఆచూకీ తెలిసిన వారు వెలుగోడు పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ సూచించారు. వివరాలకు సెల్ నంబర్ 9121101183ని సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

బైర్లూటిలో ఇంటింటా వైద్య పరీక్షలు


పిల్లల ఆరోగ్య వివరాలు సేకరిస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

ఆత్మకూరు: మండలంలోని పెద్దనంతపురం గ్రామంలో శనివారం ఇంటింటా వైద్య పరీక్షలు నిర్వహించారు. బైర్లూటి వైద్యాధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ప్రతి ఇంటి వద్ద కుటుంబ సభ్యులను కలిసి సీజనల్ వ్యాధులు, అస్వస్థతకు గురైన వివరాలు సేకరించామని, వైద్య పరీక్షలు నిర్వహించామని చెప్పారు. బీపీ షుగర్, టీబీ లాంటి వాటి కోసం రక్త పరీక్షలు సేకరించామని, అవసరం అయిన వారికి ఉచితంగా మందులు అందజేశామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అహ్మద్‌బాషా, రవి తదితరులు పాల్గొన్నారు.